ఆగమనకాలపు మొదటి ఆదివారం – బి సంవత్సరం

“మేల్కొని ఉండండి – యేసయ్య రానున్నాడు!”

మొదటి పఠనం: యెషయా 63:16బి–17, 19బి; 64:2–7

రెండవ పఠనం: 1 కొరింథీయులకు 1:3–9

సువార్త: మార్కు 13:33–37

పరిచయం

ఒకసారి తీరంలోని దీపస్తంభంలో పనిచేసే ఒక వ్యక్తిని, అతని దగ్గర పనిచేసే ఒక యువకుడు ఇలా అడిగాడు:

“సముద్రంలో ఎలాంటి ఓడలు కనిపించనప్పుడు కూడా మీరు దీపస్తంభంలోని దీపాన్ని ఇంత జాగ్రత్తగా ఎందుకు వెలిగిస్తారు?”

అందుకు ఆ వ్యక్తి చిరునవ్వులో, “ఏ సమయంలో ఏ ఓడకు ఈ వెలుగు అవసరమవుతుందో నాకు తెలియదు. ఆ వెలుగు ఎప్పుడూ వెలుగుతూనే ఉండేలా చూడటం నా బాధ్యత!” అని సమాధానమిచ్చాడు.

ప్రియమైన సహోదరీ సహోదరులారా!

ఈరోజు మనం ఆగమనకాలపు మొదటి ఆదివారంతో నూతన దైవారాధనా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్నాం. క్రిస్మస్ పండుగ కోసం రోజులు లెక్కపెట్టుకోవడం మాత్రమే మన పని కాదు. క్రీస్తు రాకడకు మన జీవితాలను సిద్ధం చేసుకోవాలని తిరుసభ మనకు పిలుపునిస్తోంది.

దీపస్తంభంలోని వెలుగును కాపాడే వ్యక్తిలాగే, మన జీవితాల్లో సమస్యలు ఏమి కనిపించకపోయినా, మన విశ్వాసమనే వెలుగు ఎప్పుడూ ఆరిపోకుండా కాపాడుకోవాలి.

ఈనాటి దైవవాక్య పఠనాలు మనకు మూడు ముఖ్యమైన సందేశాలను అందిస్తున్నాయి.

- **మొదటి పఠనంలో**, యెషయా ప్రవక్త దేవుని కోసం మానవ హృదయం పడే లోతైన ఆరాటాన్ని వ్యక్తపరుస్తున్నాడు. మనం కుమ్మరి చేతిలోని మట్టిలాంటి వారమని, దేవుడు మన జీవితాలను తిరిగి మలచగలడని గుర్తుచేస్తున్నాడు.
- **రెండవ పఠనంలో**, పునీత పౌలు దేవుడు నమ్మదగినవాడని, యేసుక్రీస్తు ప్రత్యక్షమయ్యే రోజు వరకు మనలను ఆయన బలపరుస్తాడని భరోసా ఇస్తున్నాడు.
- **సువార్తలో**, ఇంటి యజమాని ఎప్పుడు తిరిగి వస్తాడో మనకు తెలియదు కాబట్టి, మెలకువగా, అప్రమత్తంగా జీవించాలని యేసుప్రభువు ఆజ్ఞాపిస్తున్నాడు.

ఈ మూడు పఠనాలు నూతన ఆశలో, మరింత లోతైన విశ్వాసంతో, నిజమైన మనఃపరివర్తనలో ఆగమనకాలాన్ని ఆహ్వానిస్తున్నాయి.

దేవుడు మనలను ఇంకా పూర్తిగా మలచడం ముగించలేదు. చల్లబడిపోయిన మన విశ్వాసాన్ని ఆయన కృప మళ్లీ మండించగలదు. గాయపడిన మన హృదయాలను స్వస్థపరచగలదు. తప్పుదారి పట్టిన మన జీవితాలను మార్చగలదు.

ఈ పవిత్ర కాలంలోకి అడుగుపెడుతున్న మనం మన హృదయాలను ప్రశ్నించుకుందాం: మనలో దేవుని సాన్నిధ్యం ప్రకాశిస్తోందా? మన చుట్టూ ఉన్నవారి అవసరాలను గుర్తిస్తున్నామా? లేక అనవసరమైన వ్యాపకాలు, పగలు, ద్వేషాలు, నిర్లక్ష్యం మనలను ఆధ్యాత్మికంగా నిద్రపోయేలా చేశాయా?

మన తప్పులను అంగీకరిద్దాం. దేవుని కరుణను వేడుకుందాం. మనలను రక్షించడానికి వస్తున్న ప్రభువును ఆహ్వానించడానికి మన హృదయాలను సిద్ధం చేసుకుందాం.

ప్రసంగం

ఎదురుచూడటం సరిపోదు – అప్రమత్తంగా ఉండాలి!

ఒక వ్యక్తి ఒక ముఖ్యమైన రైలును ఎక్కడానికి రైల్వే స్టేషన్‌కు చాలా ముందుగానే చేరుకున్నాడు. తనకు కావలసినంత సమయం ఉందని నమ్మకంతో ఒకచోట కూర్చొని వార్తాపత్రిక చదవడం ప్రారంభించాడు. రైలు రాక గురించి లౌడ్‌స్పీకర్‌లో వినిపించిన ప్రకటనలను పెద్దగా పట్టించుకోలేదు.

కొంతసేపటి తర్వాత తలెత్తి చూసేసరికి, అతను ఎక్కవలసిన రైలు అప్పటికే వెళ్లిపోయింది!

అతను వెంటనే రైల్వే ఉద్యోగి దగ్గరకు వెళ్లి, "నేను రైలు కోసం ఎదురుచూస్తున్నాను కదా! నన్ను ఎవరైనా ఎందుకు హెచ్చరించలేదు?" అని కోపంగా ప్రశ్నించాడు.

అందుకు ఆ ఉద్యోగి, "అయ్యా! మీరు రైలు కోసం ఎదురుచూస్తున్నారు. కాని రైలు రాకను గమనించడం లేదు!" అని సమాధానమిచ్చాడు.

ప్రియమైన సహోదరీ సహోదరులారా!

ఎదురుచూడటానికి, కనిపెట్టుకుని ఉండటానికి చాలా తేడా ఉంది. మనం ఒక ముఖ్యమైన విషయం కోసం ఎదురుచూస్తున్నా, మనసు మరెక్కడో ఉండటం వల్ల అది వచ్చినప్పుడు గుర్తించలేకపోవచ్చు.

అందుకే ఈరోజు యేసుప్రభువు మనకు చెబుతున్నాడు:

"మెలకువగా ఉండండి! అప్రమత్తంగా ఉండండి!"

ఆగమనకాలం అంటే కేవలం క్రిస్మస్ కోసం ఎదురుచూడటం కాదు. క్రీస్తు మన దగ్గరకు వచ్చినప్పుడు ఆయనను గుర్తించగలిగేంత మెలకువతో జీవించడం.

1. ఆగమనకాలం – యేసయ్యకు మన హృదయంలో చోటు కల్పించడం

ఈరోజు మనం నూతన దైవారాధనా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్నాం. ప్రపంచమంతా క్రిస్మస్ సంబరాల్లో మునిగిపోయింది. శబ్దాలు, బాణసంచా, వెలుగులు, సంబరాలతో క్రిస్మస్‌ను ప్రారంభించడానికి ప్రపంచం సిద్ధమవుతోంది.

కానీ తిరుసభ మనలను కొద్దిగా నెమ్మదించమని, నిశ్శబ్దంగా ఉండమని, దేవుని స్వరాన్ని ఆలకించమని ఆహ్వానిస్తోంది.

మన ఇళ్లను అందంగా అలంకరించవచ్చు. రుచికరమైన వంటకాలు సిద్ధం చేసుకోవచ్చు. బహుమతులు కొనవచ్చు. అయితే అన్నిటికంటే ముఖ్యమైన ఒక చోటును సిద్ధం చేయడం మర్చిపోతున్నామేమో! అదే మన హృదయం.

ఒకసారి ఒక ఉపాధ్యాయురాలు తన విద్యార్థులను, "క్రిస్మస్ పండుగ కోసం మనం ఏమేమి సిద్ధం చేసుకోవాలి?" అని అడిగింది.

ఒక పిల్లవాడు, "క్రిస్మస్ చెట్టు సిద్ధం చేయాలి!" అన్నాడు.

మరొక పిల్లవాడు, "బహుమతులు కొనాలి!" అన్నాడు.

ఇంకొకరు, "కేకులు తయారు చేయాలి!" అన్నారు.

అప్పుడు ఒక చిన్న పిల్లవాడు లేచి, "మనం యేసయ్య కోసం ఒక చోటు సిద్ధం చేయాలి!" అన్నాడు.

ఉపాధ్యాయురాలు ఆశ్చర్యంగా, "ఎక్కడ సిద్ధం చేయాలి?" అని అడిగింది.

అందుకు ఆ పిల్లవాడు, "మన హృదయంలో! లేకపోతే యేసయ్య మన దగ్గరకు వచ్చినప్పుడు ఉండటానికి చోటు ఎక్కడ ఉంటుంది?" అని సమాధానమిచ్చాడు.

ఎంత చిన్న మాట! కాని ఎంత గొప్ప అర్థం!

ఆగమనకాలం మనలోని పగలు, ద్వేషాలు, స్వార్థం, అసూయ, కక్షలు, దేవుని కోసం సమయం కేటాయించనియని అనవసరమైన వ్యాపకాలను తొలగించి, మన హృదయంలో క్రీస్తుకు చోటు కల్పించమని పిలుస్తోంది.

2. దేవుని కోసం మన హృదయంలో ఉన్న, లోతైన ఆరాటం

చాలా సంవత్సరాల తర్వాత విదేశాల నుంచి తిరిగి వస్తున్న తమ పిల్లల కోసం విమానాశ్రయంలో ఆత్రంగా ఎదురుచూస్తున్న తల్లిదండ్రులను ఒకసారి ఊహించుకోండి.

లేదా ఆపరేషన్ గదిలో ఉన్న తమ కుటుంబ సభ్యుడి గురించి శుభవార్త కోసం ఆసుపత్రి బయట ఆందోళనగా ఎదురుచూస్తున్న కుటుంబాన్ని చూడండి.

ఎదురుచూపు అనేది మనకు ఆ వ్యక్తి ఎంత అవసరమో తెలియజేస్తుంది.

మన జీవితంలో ఎన్ని పనులు చేసినా, ఎన్ని విజయాలు సాధించినా, మన హృదయపు లోతుల్లో దేవుని కోసం ఒక గొప్ప ఆరాటం ఉంటుందని ఆగమనకాలం మనకు గుర్తుచేస్తోంది.

పునీత అగస్టీను గారు ఎంతో అందంగా ఇలా చెప్పారు:

“ఓ దేవా! నీలో విశ్రమించే వరకు మా హృదయాలకు నిజమైన శాంతి ఉండదు.”

ఈనాటి మొదటి పఠనంలో యెషయా ప్రవక్త దేవుని కోసం తన ఆరాటాన్ని ఇలా వ్యక్తపరుస్తున్నాడు:

“ఆకాశాన్ని చీల్చుకొని దిగిరావయ్యా!”

ప్రారంభ క్రైస్తవులు ఎంతో భక్తితో ఇలా ప్రార్థించేవారు:

“మరనాథా! ప్రభువైన యేసయ్యా, రండి!”

ఈ ఆగమనకాలంలో మన హృదయాల ప్రార్థన కూడా ఇదే కావాలి.

మనకు ఆందోళన కలిగినప్పుడు, మన కుటుంబాలలో సమస్యలు ఎదురైనప్పుడు, ఒంటరితనం బాధించినప్పుడు, దేవుని సాన్నిధ్యం అవసరమైన ప్రతి సందర్భంలోనూ మనం ఇలా ప్రార్థించాలి:

“ప్రభువైన యేసయ్యా! మా దగ్గరకు రండి. మా జీవితాల్లోకి రండి. మమ్మల్ని విడిచిపెట్టకండి!”

3. మన జీవితాల్లోని శీతాకాలాన్ని, వసంతకాలంగా మార్చగల దేవుడు

యెషయా ప్రవక్త మన ఆధ్యాత్మిక స్థితిని ఎంతో నిజాయితీగా వివరిస్తున్నాడు:

“మేమందరం ఆకులవలె వాడిపోయాము.”

కొన్నిసార్లు ప్రార్థన మనకు కేవలం ఒక అలవాటుగా మారిపోతుంది. మన హృదయాలలో పగలు, ద్వేషాలు వేళ్లూనుకుంటాయి. దేవుని కోసం సమయం కేటాయించలేనంతగా మనం పనుల్లో మునిగిపోతాం. అప్పుడు మన ఆత్మలో శీతాకాలం ఏర్పడుతుంది.

ఒకసారి చలికాలంలో పూర్తిగా ఎండిపోయినట్లుగా కనిపించిన ఒక పాత చెట్టును ఒక వ్యక్తి చూశాడు. ఆ చెట్టు ఇక బతికే అవకాశం లేదని భావించి, దానిని నరికివేయమని తోటమాలికి సలహా ఇచ్చాడు.

కాని తోటమాలి, “కొద్దిరోజులు ఆగండి. ఈ చెట్టు చనిపోలేదు. వసంతకాలం కోసం ఎదురుచూస్తోంది!” అని చెప్పాడు.

కొంతకాలానికి వసంతకాలం వచ్చింది. ఆ చెట్టుపై చిన్నచిన్న పచ్చని చిగుళ్లు కనిపించాయి. మళ్లీ ఆ చెట్టు జీవంతో కళకళలాడింది.

ప్రియమైన సహోదరీ సహోదరులారా!

ఇది మనకు ఒక గొప్ప పాఠం. మనలను మనం కానీ, ఇతరులను కానీ లొందరపడి తీర్పు చేయకూడదు. ఈరోజు మనం ఎలా ఉన్నామో దేవుడు చూస్తాడు. రేపు తన కృపలో మనలను ఎలా మార్చగలడో కూడా ఆయనకు తెలుసు.

శీతాకాలమే మన జీవితానికి ముగింపు కాదు. వసంతకాలం ఇంకా రావచ్చు!

యెషయా ప్రవక్త మరొక అందమైన ఉపమానాన్ని ఉపయోగిస్తున్నాడు:

"మేము మట్టి, నీవు మాకు కుమ్మరివాడవు."

ఒక యువకుడు ఒకసారి ఒక గొప్ప కుమ్మరిని, "అయ్యా! ఇంత అందమైన పాత్రను తయారు చేయడానికి మీకు ఎంత సమయం పట్టింది?" అని అడిగాడు.

ఆ కుమ్మరి, "నలభై సంవత్సరాలు!" అని సమాధానమిచ్చాడు.

ఆ యువకుడు ఆశ్చర్యపోయి, "ఒక పాత్ర తయారు చేయడానికి నలభై సంవత్సరాలా?" అని అడిగాడు.

అప్పుడు ఆ కుమ్మరి ఇలా వివరించాడు:

"ఈ అందమైన పాత్రను తయారు చేయగలిగే స్థాయికి నేను ఎదగడానికి నలభై సంవత్సరాలు పట్టింది!"

అలాగే దేవుడు కూడా మన జీవితాలను ఎంతో ఓర్పుతో మలుస్తాడు. మన సంతోషాలు, వైఫల్యాలు, కష్టాలు, బాధలు అన్నింటి ద్వారా ఆయన మనలను తీర్చిదిద్దుతాడు.

కొన్నిసార్లు దేవుని చేతులకు మనం సహకరించకపోవచ్చు. ఆయన చూపించే మార్గాన్ని అంగీకరించకపోవచ్చు. అయినప్పటికీ, ఈ ఆగమనకాలంలో ఆయన మనలో పనిచేయడానికి మనలను పూర్తిగా అప్పగించుకోవాలని తిరుసభ పిలుస్తోంది.

మన జీవితాలు ఇంకా పూర్తికాలేదు. మనలను మలచడం దేవుడు ఇంకా ముగించలేదు!

4. దేవుడు నమ్మదగినవాడు – విశ్వాసమనే జ్యోతిని వెలిగించుకుందాం

రెండవ పఠనంలో పునీత పౌలు కొరింతు క్రైస్తవులకు ఒక గొప్ప భరోసా ఇస్తున్నాడు:

"దేవుడు నమ్మదగినవాడు."

కొరింతు సంఘంలో విభేదాలు ఉన్నాయి. బలహీనతలు ఉన్నాయి. అనేక సమస్యలు ఉన్నాయి. అయినప్పటికీ దేవుని విశ్వాస్యత వారిని విడిచిపెట్టలేదు.

వారి తప్పులు దేవుని కృపను రద్దు చేయలేకపోయాయి. అలాగే మన తప్పులు కూడా దేవుని ప్రేమను, కృపను మన నుంచి దూరం చేయలేవు.

ఒకసారి మండుతున్న మంటల్లోంచి ఒక చిన్న నిప్పుబొగ్గును బయటకు తీసి పక్కన పెట్టారు. మొదట అది మండుతూనే ఉంది. కానీ కొంతసేపటికి చల్లబడి నల్లగా మారిపోయింది.

అదే నిప్పుబొగ్గును తిరిగి మండుతున్న బొగ్గుల మధ్య ఉంచగానే మళ్లీ ఎర్రగా మండటం ప్రారంభించింది.

మన విశ్వాసం కూడా అలాగేఉంటుంది.

దేవునికి దూరమైనప్పుడు, దివ్యబలికి దూరమైనప్పుడు, దేవుని వాక్యాన్ని వినడానికి సమయం కేటాయించనప్పుడు మన విశ్వాసం చల్లబడిపోతుంది.

కానీ మనం తిరిగి దేవుని దగ్గరకు వచ్చినప్పుడు, ప్రార్థనలో, క్రీస్తుతో సహవాసంలో, దివ్యసత్ప్రసాదంలో పాల్గొన్నప్పుడు మనలోని విశ్వాసమనే జ్యోతి మళ్లీ ప్రకాశిస్తుంది.

ఈ ఆగమనకాలంలో మనలో బలహీనపడిపోయిన దయ, కరుణ, క్షమాపణ, విశ్వాసం వంటి సుగుణాలను మళ్లీ బలపరచుకోవాలి.

ఎందుకంటే మన వైఫల్యాలకంటే దేవుని విశ్వాస్యత గొప్పది!

5. మెలకువగా ఉండండి – ఇతరులలో క్రీస్తును గుర్తించండి

ప్రపంచంలో మన చుట్టూ ఎన్నో హెచ్చరిక వ్యవస్థలు ఉన్నాయి. వాహనాలు ప్రమాదాల గురించి హెచ్చరిస్తాయి. అగ్నిప్రమాదాన్ని గుర్తించే పరికరాలు మనలను అప్రమత్తం చేస్తాయి. మన చేతిలోని చరవాణులు కొత్త సందేశాలు వచ్చినప్పుడు మనలను అప్రమత్తం చేస్తాయి.

కాని యేసుప్రభువు మనలోని అంతరంగ హెచ్చరిక వ్యవస్థను పరిశీలించమని కోరుతున్నాడు.

నేను దేవునికి దూరమవుతున్నప్పుడు గుర్తిస్తున్నానా? నా మాటలతో ఇతరులను బాధిస్తున్నప్పుడు తెలుసుకుంటున్నానా? మరొకరు బాధపడుతున్నప్పుడు నా హృదయంలో స్పందన కలుగుతోందా? లేక ఇతరుల కష్టాలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా జీవిస్తున్నానా?

ఒక వ్యక్తి ప్రతిరోజూ ఉదయం బస్సులో ప్రయాణించేవాడు. అదే బస్సులో ఒక వృద్ధురాలు కూడా ప్రయాణించేది.

ఒకరోజు ఆమె ముఖంలో మామూలుకంటే ఎక్కువ బాధ కనిపించింది. ఆ వ్యక్తి తన చరవాణిని చూస్తూ కూర్చోకుండా, ఆమెను పలకరించి, "అమ్మా! మీరు బాగానే ఉన్నారా?" అని అడిగాడు.

ఆమె వెంటనే కన్నీళ్లు పెట్టుకుంది. ఇటీవలే తన భర్త చనిపోయాడని, ఆ ఉదయం నుంచి తనతో మాట్లాడటానికి ఎవరూ లేరని చెప్పింది.

ఆమె అతనితో, "బాబూ! ఈరోజు నాతో మాట్లాడిన మొదటి వ్యక్తివి నువ్వే!" అని కృతజ్ఞతలు తెలిపింది.

ఆ వ్యక్తి తర్వాత ఇలా చెప్పాడు:

"ఆరోజు నేను ఆమెకు సహాయం చేశానని అనుకున్నాను. కానీ నిజానికి మెలకువగా ఉండటం అంటే ఏమిటో ఆమె నాకు నేర్పించింది!"

ప్రియమైన సహోదరీ సహోదరులారా!

క్రీస్తు మన దగ్గరకు ఎప్పుడు వస్తాడో మనకు తెలియదు. మన ఒంటరి పొరుగువారిలో, క్షమాపణ కోసం ఎదురుచూస్తున్న మన కుటుంబ సభ్యులలో, నిశ్శబ్దంగా బాధపడుతున్న వ్యక్తులలో ఆయన మనలను కలుసుకోవచ్చు.

పరిశుద్ధ దేవుని వాక్యంలో, దివ్యసత్ప్రసాదంలో ఆయన మనకు ఎదురవుతాడు. అంతేకాదు, మన ఆదరణ అవసరమైన ప్రతి వ్యక్తిలోనూ ఆయన మనలను కలుసుకుంటాడు.

కాబట్టి నిజమైన మెలకువ అంటే మన చుట్టూ ఉన్న సాధారణ మనుషులలోనే క్రీస్తును గుర్తించడం!

6. కార్యరూపంలో ఎదురుచూపు – తదుపరి అడుగు వేయండి

ఆగమనకాలంలో మన ఎదురుచూపు నిర్లక్ష్యంగా, ఏ పని చేయకుండా ఉండే ఎదురుచూపు కాకూడదు.

ఈనాటి సువార్తలో ఇంటి యజమాని తన సేవకులకు బాధ్యతలు అప్పగించి ప్రయాణానికి వెళతాడు. తాను తిరిగి వచ్చేవరకు ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన పనులను నమ్మకంగా చేయాలని ఆశిస్తాడు.

అలాగే రాకడ కోసం ఎదురుచూస్తున్న మనం కూడా మనకు అప్పగించిన బాధ్యతలను నమ్మకంగా నిర్వర్తించాలి.

చాలాకాలం తర్వాత ఇంటికి తిరిగి వస్తున్న తన కుమారుని కోసం ఎదురుచూస్తున్న ఒక తల్లిని ఊహించుకోండి.

ఆమె కేవలం కూర్చొని ఎదురుచూడదు. ఇంటిని శుభ్రం చేస్తుంది. కుమారుడికి ఇష్టమైన వంటకాలను సిద్ధం చేస్తుంది. అతని గదిని చక్కగా సర్దుతుంది.

ఆమె ఎదురుచూపు ప్రేమలో కూడిన పనుల ద్వారా వ్యక్తమవుతుంది.

అలాగే క్రీస్తు కోసం మన ఎదురుచూపు కూడా కార్యరూపంలో ఉండాలి. మనం క్షమించాలి. సేవ చేయాలి. ఇతరులను ప్రోత్సహించాలి. బాధపడుతున్నవారిని ఓదార్చాలి. ప్రార్థించాలి.

ఈ ఆగమనకాలంలో మనం చేయవలసిన తదుపరి పని బహుశా ఇదే కావచ్చు:

- పాపసంకీర్తనం ద్వారా దేవునిలో మళ్లీ సయోధ్య పొందడం.
- మనలో విభేదించిన వ్యక్తితో రాజీపడటం.
- అనారోగ్యంలో ఉన్న వ్యక్తిని పరామర్శించడం.
- ఒంటరిగా ఉన్నవారికి ఫోన్ చేసి పలకరించడం.
- ప్రార్థనను మళ్లీ ప్రారంభించడం.
- ఇతరులను ప్రేమలో ప్రోత్సహించడం.

ఈరోజే మనం అన్నింటిని పరిష్కరించవలసిన అవసరం లేదు. క్రీస్తులో కలిసి మన తదుపరి అడుగు వేస్తే చాలు!

ముగింపు – మనకు దారి తెలుసు!

ఒకసారి ఒక చిన్న అమ్మాయి తన తండ్రితో కలిసి గ్రామీణ ప్రాంతంలో ప్రయాణిస్తోంది. చికటి పడటం ప్రారంభమైంది.

ఆ చిన్నారి తన తండ్రిని, "నాన్నా! నీకు రోడ్డు కనిపిస్తోందా?" అని అడిగింది.

"కనిపిస్తోందిబంగారూ!" అని తండ్రి సమాధానమిచ్చాడు.

ఆమె మళ్లీ, "మన ఇల్లు ఉన్నంత దూరం వరకు రోడ్డు కనిపిస్తోందా?" అని అడిగింది.

తండ్రి చిరునవ్వులో, "లేదు బంగారూ! కాని మనం సురక్షితంగా ఇంటికి చేరుకోవడానికి సరిపడా దారి నాకు కనిపిస్తోంది!" అని చెప్పాడు.

అప్పుడు ఆ చిన్నారి తండ్రికి దగ్గరగా జరిగి, "పరవాలేదు నాన్నా! నాకు మొత్తం దారి కనిపించనవసరం లేదు. నువ్వు బండిని నడుపుతున్నావని నాకు తెలిస్తే చాలు!" అని చెప్పింది.

ప్రియమైన సహోదరీ సహోదరులారా!

అదే నిజమైన విశ్వాసం!

రేపు ఏమి జరుగుతుందో మనకు తెలియదు. రాబోయే సంవత్సరంలో మన జీవితాల్లో ఎలాంటి సంఘటనలు ఎదురవుతాయో కూడా తెలియదు. కొన్నిసార్లు మన జీవితాలను చికటి కమ్ముకోవచ్చు. దేవుడు ఏమి చేస్తున్నాడో మనకు అర్థం కాకపోవచ్చు.

కాని మనలను ఎవరు నడిపిస్తున్నారో మనకు తెలుసు. మన పరలోక తండ్రికి మన గమ్యం తెలుసు!

కాబట్టి ఈ ఆగమనకాలాన్ని భయంలో కాకుండా ఆశలో, ఆందోళనలో కాకుండా విశ్వాసంలో ముందుకు సాగుదాం.

కేవలం మన ఇళ్లను క్రిస్మస్ కోసం సిద్ధం చేయకుండా, మన హృదయాలను క్రీస్తు కోసం సిద్ధం చేసుకుందాం.

మన ప్రార్థన ఇదే కావాలి:

"మరనాథా! ప్రభువైన యేసయ్యా, రండి!

మా ఇళ్లలోకి రండి. మా కుటుంబాలలోకి రండి. గాయపడిన మా బంధాలలోకి రండి. మా హృదయాలలోకి రండి.

మీరు మా దగ్గరకు వచ్చినప్పుడు మేము నిద్రపోతూ కాకుండా, మెలకువగా ఉండేలా చేయండి. నిర్లక్ష్యంగా కాకుండా అప్రమత్తంగా ఉండేలా చేయండి. విశ్వాసం కోల్పోకుండా నమ్మకంగా జీవించేలా చేయండి.

మిమ్మల్ని ఆనందంలో ఆహ్వానించడానికి సిద్ధంగా ఉండేలా మమ్మల్ని ఆశీర్వదించండి.”

ఆమేన్!